
# కాంగ్రెస్‌ది నయవంచన



- ఎన్నికల్లో ఓట్లు వేయించుకునేదాకా ఊదరగొట్టింది
- తీరా ఇప్పుడు బీసీలు తగ్గారంటూ మాయచేస్తోంది
- ఏటికేడు పెరిగే జనాభా ఇప్పుడెలా తగ్గిందో చెప్పాలి?
- బీసీలను మోసం చేసేందుకే జనాభాను తగ్గించి చూపింది
- రిజర్వేషన్లపై ద్రోహం చేస్తే 'స్థానిక'ంలో గుణపాఠం చెబుతాం
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో భగ్గుమంటున్న బహుజనులు
- రిజర్వేషన్లపై కాంగ్రెస్ సర్కారుది మోసమంటూ మండిపాటు

*బీసీల రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ సర్కారు నయవంచనకు పాల్పడిందంటూ బహుజనులు మండిపడుతున్నారు. ఏకంగా తమ జనాభాను తగ్గించి చూపి తమను మోసం చేయాలని కుట్రపన్నుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు వేయించుకునేదాకా ఊదరగొట్టిన కాంగ్రెస్.. తీరా ఇప్పుడు తమను ఊడ్చిపారేస్తోందని ధ్వజమెత్తుతున్నారు. తాము అధికారం చేపట్టగానే రాజ్యాంగబద్ధంగా బీసీ రిజర్వేషన్లు తెస్తామని, వాటి ప్రకారం 42 శాతం కోటా కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు మాట తప్పిందని మండిపడుతున్నారు. శాసనసభ ఎన్నికలకు ముందు రిజర్వేషన్ల పేరిట హామీలు, డిక్లరేషన్లు ఇచ్చిన కాంగ్రెస్.. అధికారం చేపట్టి ఏడాది దాటినా ఆ హామీలపై మౌనం వహించిందని ఆరోపించారు. ఇప్పుడు స్థానిక సంస్థల్లోనూ లబ్ధిపొందడం కోసం మళ్లీ కుట్రకు తెరతీసిందని దుయ్యబట్టారు. ఇందుకోసం హడావిడిగా కులగణన చేపట్టిందని, ఆ సర్వేనూ అసంపూర్ణంగా చేసిందని, దాని ప్రకారం బీసీల జనాభా తగ్గినట్లు చెబుతోందని మండిపడ్డారు. అయినా, ఏటికేడు పెరగాల్సిన జనాభా.. కేవలం బీసీల్లోనే ఎలా తగ్గుతుందని ప్రశ్నించారు. కేవలం బీసీలకు ద్రోహం చేసేందుకే తమ జనాభాను తగ్గించి చూపించిందని, ఓసీలకు మేలు చేసేందుకే వారి జనాభా పెరిగినట్లు చెబుతోందని ధ్వజమెత్తారు. పైగా రిజర్వేషన్ల విషయంలోనూ కొత్త నాటకం మొదలుపెట్టిందని దుయ్యబట్టారు. రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం చేశామని, ఆమోదం కోసం కేంద్రానికి పంపామని, కేంద్రం ఆమోదిస్తేనే రాజ్యాంగపరమైన చిక్కులు లేకుండా అమలు చేస్తామని చెబుతూ నెపాన్ని కేంద్రం మీదకు నెట్టి తమకు అన్యాయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ద్రోహం చేసిన కాంగ్రెస్‌కు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పితీరుతామంటూ ఉమ్మడి ఖమ్మం జిల్లా బహుజనులు శపథం చేస్తున్నారు.*

-ఖమ్మం, నమస్తే తెలంగాణ ప్రతినిధి/భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ, ఫిబ్రవరి 6

### బీసీలకు అన్యాయం చేసేందుకే సర్వే!



కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన కులగణన సర్వే మొత్తం తప్పులమయంగా ఉంది. ప్రభుత్వం విడుదల చేసిన నివేదికలో బీసీల జనాభా గణనీయంగా తగ్గింది. అంటే ఇదే నివేదిక ఆమోదం పొందితే బీసీలకు తీవ్రంగా అన్యాయం జరుగుతుంది. బీసీలకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన రిజర్వేషన్లను కచ్చితంగా అమలుచేయాలి. తమ ప్రభుత్వం రాగానే బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామంటూ హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు ఏకంగా బీసీ జనాభా శాతాన్ని గణనీయంగా తగ్గించింది. అంటే బీసీలకు తీవ్రమైన అన్యాయం చేసింది. దీనిపై బీసీలమంతా ఐక్యంగా పోరాడుతాం.

**–లింగిశెట్టి వెంకటేశ్వరావు, బీసీ సంక్షేమ సంఘం, అశ్వారావుపేట**

### బీసీల జనాభాను తగ్గించి చూపించారు..



కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఇటీవల చేపట్టిన కులగణన సర్వే తప్పులతడకలా ఉంది. ఈ సర్వేలో బీసీల జనాభాను భారీగా తగ్గించి చూపించారు. ఇటీవల రెండు నెలలపాటు చేపట్టిన ఈ సర్వే వల్ల ఎలాంటి ప్రయోజనమూ లేదు. వాస్తవంగా గత కేసీఆర్ ప్రభుత్వం నాటి సర్వే ప్రకారం రాష్ట్రంలో బీసీల జనాభా 60 శాతానికంటే ఎక్కువగా ఉంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో మాత్రం 46 శాతంగానే నమోదైంది. ఇంత వ్యత్యాసం ఎలా ఉంటుంది? అదీగాక ఓసీల జనాభా ఒక్కసారిగా ఎలా పెరిగింది? మళ్లీ సర్వే చేసే వరకూ బీసీలమంతా ఉద్యమిస్తాం.

**– రంగిశెట్టి కోటేశ్వరరావు, బీసీ సంఘం నాయకుడు, మధిర**

### పెరగాల్సిన జనాభా.. ఎలా తగ్గుతుంది?



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల చేసిన కులగణన సర్వే సమగ్రంగా లేదు. మరోసారి పూర్తిస్థాయిలో సర్వే చేస్తేనే జనాభా వివరాలు సమగ్రంగా ఉంటాయి. ఏటికేడు జనాభా సంఖ్య పెరగడమే తప్ప తగ్గదు కదా? మరీ రేవంత్ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో బీసీలు మాత్రమే ఎలా తగ్గారు? కులగణన మొత్తం అసంపూర్ణంగా ఉన్నట్లు ఈ సర్వే గణాంకాలే తేటతెల్లం చేస్తున్నాయి. వంద శాతం సర్వేను పూర్తి చేయకుండానే గణాంకాలు వెల్లడించడం ఏమిటి? స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం హడావిడిగా సర్వే నివేదికను ఆమోదించి బీసీలకు అన్యాయం చేస్తారా?

**–పెద్దారపు నాగరాజు, బీసీ నాయకుడు, అన్నపురెడ్డిపల్లి**

### కులగణనలో శాస్త్రీయత లేదు..



కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, కులగణన సర్వేలో శాస్త్రీయత లేదు. బీసీల సంఖ్య గణనీయంగా తగ్గడమే ఇందుకు నిదర్శనంగా కన్పిస్తోంది. సర్వే మొత్తం తప్పులమయంగా ఉంది. ఈ అసమగ్ర సర్వేను ఏవిధంగా ప్రామాణికంగా తీసుకుంటారు? దీనిని తుది సర్వేగా భావిస్తే బీసీలకు తీరని అన్యాయం జరుగుతుంది. ఈ కులగణన సర్వేకు చాలామంది దూరంగా ఉన్నారు. కానీ సర్వే పూర్తయిందని ప్రభుత్వం చెబుతోంది. కొందరిని వదిలేసే చేసిన సర్వేలో సమగ్రత లోపించినట్లే కదా? శాస్త్రీయత లేని ఈ సర్వేను పక్కనబెట్టి మరోసారి సర్వే నిర్వహించాలి.

**–భూపతి నరసింహారావు, బీఆర్‌ఎస్ నేత, బీసీ నాయకుడు, అన్నపురెడ్డిపల్లి**

### కులగణన పేరిట వంచన..



కులగణన పేరు చెప్పి బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం వంచించింది. గత కేసీఆర్ ప్రభుత్వం 2014లో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో ఉన్న బీసీల సంఖ్య కంటే తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో బీసీల సంఖ్య భారీగా తగ్గింది. గతంకంటే బీసీ సంఖ్య ఏకంగా పది శాతం తక్కువగా ఉందంటే ఈ కులగణన ఎంతటి వాస్తవదూరమే అర్థమవుతోంది. బీసీలను అణగదొక్కేందుకే రేవంత్‌రెడ్డి సర్కార్ ఈ కులగణనను తప్పులతడకగా చేపట్టింది. అయితే ఈ కులగణనతో బీసీలకు తీరని నష్టం కలుగుతుంది. అందుకని దీనిని వెనక్కు తీసుకోవాలి.

**–యార్లగడ్డ శ్రీనివాసరావు, బీసీ సంఘం నాయకుడు, దమ్మపేట**

### హడావిడి సర్వేతో తప్పుడు లెక్కలు



స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం హడావిడిగా బీసీల కులగణన చేసి తప్పుడు లెక్కలు చూపిస్తోంది. రాష్ట్రంలో 46 శాతంగా బీసీలు ఉన్నారని చెప్పడం తప్పుడు సర్వేకు నిదర్శనం. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 56 శాతంగా ఉన్న బీసీలు.. ఇప్పుడు పది శాతానికి తగ్గడం వెనుక కుట్ర దాగి ఉంది. గతంలో 6 శాతంగా ఉన్న ఓసీలు.. ప్రస్తుతం 15 శాతానికి పెరిగినట్లు చూపించడం సరికాదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడం ఖాయం.

**–ఖమ్మంపాటి రేణుక, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి, ఇల్లెందు**

### జనాభా తక్కువ చేసి చూపించడం సరికాదు..



రాష్ట్రంలో అధికంగా ఉన్న బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనలో తక్కువ చేసి చూపించడం సరికాదు. బీసీల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందనేది అర్థమవుతుంది. దేశంలో బీసీలకు ప్రాధాన్యత ఇస్తున్నాం.. గణాంకాలు చేస్తున్నాం.. అని గొప్పలు చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీల ప్రాధాన్యతను తగ్గించేందుకే కంకణం కట్టుకున్నట్లు తెలుస్తుంది.

**–సిలివేరి సత్యనారాయణ, తెలంగాణ ఉద్యమ నేత, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు**

### కాంగ్రెస్‌వన్నీ తప్పుడు లెక్కలు



బీసీలను వంచించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తప్పుడు లెక్కలు ప్రకటించింది. బీసీల కులగణన అంతా తప్పుల తడక. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో 56 శాతంగా తేలిన బీసీలు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వేలో 46 శాతం ఎలా ఉంటారు? బీసీలకు అన్ని రకాలుగా ప్రయోజనాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబుతున్న మాటలన్నీ బూటకం. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు కాంగ్రెస్ బుద్ధి చెప్పడం ఖాయం.

**– గుంటి పుల్లయ్య, తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ బీసీ మండల నాయకుడు**

### కులగణన తప్పుల తడక



బీసీల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే తప్పుల తడకలా ఉంది. సొంత పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రభుత్వం చేపట్టిన సర్వేను డిబేట్‌లో పెట్టి మరీ పేపర్లు చించివేస్తూ కేసీఆర్ సర్వేను పొగిడారు. ఓట్ల సమయంలో బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి ఇప్పుడు సుప్రీం కోర్టు గైడ్ లైన్స్ ప్రకారం కేంద్రానికి నివేదిక పంపుతామని చెప్పడం సిగ్గుచేటు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ ఓటర్లు ప్రభుత్వానికి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలి. బీసీలకు అన్యాయం చేస్తే బీఆర్‌ఎస్ చూస్తూ ఊరుకోదు.

**–ఆకోజు సునీల్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్, భద్రాచలం**

## హామీలు విస్మరించిన కాంగ్రెస్ సర్కార్

- గత కేసీఆర్ ప్రభుత్వ పథకాల్లో కోత విధించడమే వారి పని..
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించాలి
- పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా



దుమ్ముగూడెంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు

దుమ్ముగూడెం/పర్ణశాల, ఫిబ్రవరి 6 : ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు ఈసడించుకుంటున్నారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని బీఆర్‌ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. తూరుబాక, డబ్ల్యూఎల్ రేగుబల్లి, పర్ణశాల, బీ కొత్తగూడెం, సింగవరం, దంతెనం, బండిరేవు పంచాయతీలలో బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కణితి రాముడు అధ్యక్షతన గురువారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రేగా మాట్లాడారు. అధికారాన్ని చేజిక్కించుకునేందుకు అలవికాని హామీలు గుప్పించిన కాంగ్రెస్.. ఇప్పుడు వాటి ఊసెత్తడం లేదన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కోత విధించడమే పనిగా పెట్టుకున్నదని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంటుందని అన్నారు. గత కేసీఆర్ పదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, చేపట్టిన సంక్షేమ పథకాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని, ప్రతీ కుటుంబానికి ఏదో ఒక రూపంలో సంక్షేమ పథకాలు అందాయని గుర్తు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని కోరారు. కష్టపడి పనిచేసే ప్రతీ ఒక్కరికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని, వారికి పదవులు కూడా దక్కుతాయన్నారు. బీఆర్‌ఎస్ పోటీ చేసే అత్యధిక స్థానాల్లో అభ్యర్థులను గెలిపించుకోవాలని రేగా కోరారు. సమావేశాల్లో భద్రాచలం నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణ, వాసురాజు, బీఆర్‌ఎస్ కో కన్వీనర్ ఎండీ జానీపాషా, మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి, ఒల్లి వెంకట్రావ్, కాల్వ పూర్ణయ్య, కాటెబోయిన వెంకటేశ్వర్లు, సోడె కొండయ్య, భూక్యా చందు, దొడ్డి తాతారావు, ఆకోజు సునీల్, తునికి కామేశ్, జోగా బుజ్జి, దామెర్ల శ్రీనివాసరావు, వాగే వెంకటేశ్వరరావు, జుంజురి జయసింహ, మడకం భూపతి, పార్టీ లీగల్ సెల్ అడ్వకేట్ కొత్త మల్లేశ్, గంట్ల సురేశ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్ ప్రకారం నులి పురుగుల నివారణ మాత్రలు

**భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్**



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : వివిధ శాఖలు సమన్వయంతో ప్రత్యేక షెడ్యూల్ రూపొందించుకొని నులి పురుగుల నివారణ మాత్రలు అందించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశించారు. ఈ నెల 10న నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో వీటిని అందించాలన్నారు. మాత్రలు వేసుకోవడం ద్వారా పిల్లల్లో రక్తహీనత, బుద్ధిమాంద్యం నివారించవచ్చని, చదువుల పట్ల ఏకాగ్రత పెరుగుతుందన్నారు. జిల్లాలో 3,36,212 మంది ఒకటి నుంచి 19 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న ప్రతీ ఒక్కరికి ఆల్బెండజోల్(నులి పురుగుల నివారణ మాత్రలు) అందించాలన్నారు. మాత్రల ఉపయోగంపై కళాజాతా బృందాలు, మహిళా సమాఖ్యల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించాలని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విద్యాచందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, జిల్లా వైద్యాధికారి భాస్కర్‌నాయక్, డీసీహెచ్‌ఎస్ రవిబాబునాయక్, డీడబ్ల్యూవో స్వర్ణలత లెనీనా, బీసీ సంక్షేమాధికారి ఇందిర, ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారి అనసూయ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఎరుపెక్కిన ఏఎంసీ!

- విక్రయానికి 75 వేల బస్తాల మిర్చి రాక
- జెండాపాటలో క్వింటా ధర రూ.14,025

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 6 : ప్రస్తుత సీజన్‌లో ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు రికార్డు స్థాయిలో మిర్చి వచ్చింది. యార్డులో ఎటుచూసినా మిర్చి బస్తాలే కనిపించడంతో కళకళలాడింది. అయితే ధరలను పరిశీలిస్తే రైతులు దిగాలు చెందే పరిస్థితి కనిపించింది. గురువారం ఉదయం జెండాపాట సమయానికి జిల్లా రైతులతోపాటు పొరుగు జిల్లాల నుంచి 75 వేల బస్తాలను విక్రయానికి తరలించారు. జెండాపాటలో క్వింటా గరిష్ట ధర రూ.14,025, కాగా, మధ్య ధర క్వింటా రూ.13,700, కనిష్ట ధర రూ.6 వేల చొప్పున పలికింది. తాలు రకం పంట క్వింటా గరిష్ట ధర రూ.6,900 పలుకగా, కనిష్ట ధర రూ.5 వేల చొప్పున ఖరీదుదారులు కొనుగోలు చేశారు. అలాగే ఏసీ రకం పంట క్వింటా గరిష్ట ధర రూ.13,300కే పరిమితమైంది. మార్కెట్‌లో విక్రయానికి పంట తాకిడి పెరుగుతున్న నేపథ్యంలో ధరలో తేడా రాకపోవడంతో రైతులు విధిలేని పరిస్థితిలో అమ్ముకోవాల్సి వస్తున్నది. మిర్చి యార్డుకు భారీగా పంట రావడంతో చైర్మన్ హనుమంతరావు, సెక్రటరీ ప్రవీణ్‌కుమార్‌లు క్రయవిక్రయాలు, కాంటాల ప్రక్రియను నిశితంగా పరిశీలించారు. సకాలంలో కాంటాలు, తోలకాలు ముగిసే విధంగా చూడాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు విక్రయానికి తీసుకొచ్చిన మిర్చి బస్తాలు

## ఎండకు ఎండి.. వానకు తడిసి...

- కలెక్టరేట్‌లో వాహనాలకు నీడలేక ఇబ్బందులు
- చెప్పుకోలేక సతమతమవుతున్న ఉద్యోగులు
- కార్యాలయానికి వచ్చే ప్రజలకూ తప్పని తిప్పలు
- పార్కింగ్ షెడ్లు నిర్మించాలని వేడుకోలు

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 6 (నమస్తే తెలంగాణ) : అన్ని శాఖలు ఒకేచోట ఉండే కలెక్టరేట్‌లో వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ షెడ్లు లేకపోవడంతో వాహనాలు ఎండకు ఎండి, వానకు తడవాల్సి వస్తున్నది. ప్రజలకు పాలన చేరువయ్యేందుకు ఐడీవోసీ(సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం)ని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురాగా ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ కనీసం పార్కింగ్ సౌకర్యం కల్పించడంలో విఫలమైంది. ఒకరోజూ కాదు.. రెండురోజులు కాదు నిత్యం ఉద్యోగులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకతప్పడం లేదు. ప్రతిరోజు 500 వాహనాలు అక్కడ పార్కింగ్ చేస్తున్నారు. పార్కింగ్ షెడ్లు లేకపోవడంతో ఒకవైపు ప్రజలు.. మరోవైపు ఉద్యోగులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నాలుగు చక్రాల వాహనాలు దుమ్మూధూళితో నాశనమవుతున్నాయి. చిన్న ఉద్యోగి నుంచి పెద్ద అధికారి వాహనాలకూ నీడ సమస్య తప్పడం లేదు.

### చెప్పుకోలేక.. చేసేదేమీలేక..

ఐడీవోసీలో విశాలమైన ప్రాంగణం ఉన్నా వాహనాలకు నిలువ నీడలేకపోవడం విడ్డూరంగా ఉంది. పచ్చని వాతావరణం కోసం మొక్కలను బాగానే పెంచుతున్నారు.. కానీ.. వాహనాలు నిలపడానికి నీడలేకపోవడంతో ఎవరితో చెప్పుకోలేక.. చేసేదేమీలేక ఉద్యోగులు సతమతమవుతున్నారు. కలెక్టరేట్ ఎదుట నీడగా ఉంది కదా అని అక్కడ పార్కింగ్ చేస్తే సెక్యూరిటీ వచ్చి ఇక్కడ వాహనాలు పెట్టవద్దని తీయించేస్తున్నారు. దీంతో ఐడీవోసీ వెనుక భాగంలో పార్కింగ్ చేయాల్సి వస్తుందని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చేది ఎండాకాలం టూ వీలర్లు ఎండలో పెడితే పెట్రోల్ ఆవిరైపోతుందని వారు వాపోతున్నారు. ప్రతిరోజూ లీటరు వరకు ఆవిరైతే జీతం అంతా పెట్రోల్‌కే సరిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద అధికారులకు ముందుపడి చెప్పడానికి ధైర్యం లేక మదనపడుతున్నారు.

### ప్రజలకూ తప్పని తిప్పలు..

కలెక్టరేట్ అంటే జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వస్తుంటారు. ప్రతి సోమవారం ప్రజావాణికి వందలాది మంది వస్తారు. దగ్గర ప్రాంతం నుంచి వచ్చేవారు టూవీలర్ వాహనాలపై వస్తే.. దూరం నుంచి వచ్చేవాళ్లు నాలుగు చక్రాల వాహనాలపై వస్తున్నారు. వీరి వాహనాలకు పార్కింగ్ బెడద తప్పడం లేదు. ప్రజల వాహనాలకు కూడా నీడ లేకపోతే ఎట్లా అని వారు ప్రశ్నిస్తున్నారు.



ఐడీవోసీలో వాహనాల నిలుపుదలకు పార్కింగ్ స్థలంలో నీడలేక బయటనే వాహనాలు

### ప్రతి వారం వస్తున్నా..



ప్రజల సమస్యలపై ఫిర్యాదులు ఇవ్వడానికి ప్రతివారం వస్తున్నాను. వాహన పార్కింగ్ ఉన్నా నీడ లేదు. ఎండకు ఎండాలి.. వానకు తడవాల్సిందే. పెద్ద సార్లు మారుతున్నా పట్టించుకోవడం లేదు. ఫిర్యాదులు చేయడానికి వచ్చిన వారికి కనీస సౌకర్యాలు కల్పించడంలేదు. ఒక్కోసారి లోపలికి రావడానికి కూడా అనుమతించడం లేదు.

**– యర్రా కామేష్, కొత్తగూడెం**

### ఉద్యోగులు చెప్పలేకపోతున్నారు..



కలెక్టరేట్ అసలే కొత్తగూడేనికి దూరంగా ఉంది. ప్రతి ఉద్యోగి వాహనం మీద రావాల్సిందే. బస్సు మీద రావాలంటే ఆర్టీసీ బస్సులు అక్కడ ఆపడం లేదు. వచ్చినా పైవరకు నడవాలంటే పెద్ద వాళ్లకు ఇబ్బందులే. తీరా వాహనం తెస్తే ఎండలో పెట్టాలి. పైన చెట్లు కూడా లేవు. ఎండకు ఎండాల్సిందే. వానొస్తే తడిసిపోవడమే. మాకు కలెక్టరేట్‌లో చాలా పనులుంటాయి. ఆదివాసీల సమస్యల కోసం నిత్యం వస్తుంటాము. వాహనాల పార్కింగ్ కోసం షెడ్లు వేయించాలి.

**– వాసం రామకృష్ణ, ఆదివాసీ నాయకుడు**